క్లుప్తంగా

ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: యూనియన్ బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో శ్రీకాకుళం జిల్లా గ్రామీణ ప్రాంత మహిళలకు బ్యూటీ పార్లర్, టైలరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు శిక్షణ సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 79933 40407, 95534 10809 నంబర్లను సంప్రదించాలన్నారు.

శ్రీకాకుళం ఎంపీడీఓగా రామ్మోహన్‌రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న రామ్మోహన్‌రావు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీడీఓగా రామ్మోహన్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నియమితులైన సతీష్ బదిలీపై విశాఖపట్నం వెళ్లారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న ప్రకాశరావు స్థానంలో రామ్మోహన్‌రావు బాధ్యతలు చేపట్టారు.

నిరుపేదకు సాయం



చక్రాల కుర్చీ, సరుకులు అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక నీలమ్మకాలనీకి చెందిన మానాపురం గౌరీశంకర్ మనవారాలు కె.దివ్యజ్యోతికి రెండు కిడ్నీలు పాడై మంచానికే పరిమితమైంది. వీరి దీనస్థితిని తెలియచేస్తూ తవుడు, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ఉమాశంకర్‌లు వాట్సాప్ గ్రూపులో షేర్ చేయగా పెద్దపాడుకు చెందిన పల్లా అప్పలసూరి మనవడు బొట్టా సాయికుమార్ రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు, రైస్ ప్యాకెట్, మూడు చక్రాల కుర్చీని మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, సుప్రజ రౌత్, అల్లడ నవీన్, పొడుగు చరణ్, అవినాష్, తవుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎంపీ కలిశెట్టి



ఎస్పీ మహేశ్వరరెడ్డితో ఎంపీ కలిశెట్టి

శ్రీకాకుళం క్రైమ్ : విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని వేర్వేరుగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు.


ఆదిత్యున్ని దర్శించుకున్న రిటైర్డ్ డీఐజీ



రవీంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో చంద్రశేఖర్

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రిటైర్డ్ డీఐజీ రవీంద్రబాబు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నేత, నాయీబ్రాహ్మణుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కనకారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న నాయీబ్రాహ్మణులు రవీంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

యువత సన్మార్గంలో నడవాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం రూరల్: యువత తప్పుదారి పట్టి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసుకోవద్దని రూరల్ సీఐ పైడపునాయుడు, ఎస్ఐ వాసుదేవరావు హితవుపలికారు. మంగళవారం చాపురం పంచాయతీలో యువకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్నారు. మహిళల పట్ల మర్యాదతో మెలగాలన్నారు. మైనర్లు వాహనాన్ని నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దన్నారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలు పెట్టి సౌండ్ పొల్యూషన్ చేయకుండా ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

శ్రీకాకుళం అర్బన్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలోని సంచార భవన్‌వద్ద బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావు, శారద, అరుణశ్రీ, లక్ష్మి, ఎస్.అభిమన్యు, పి.రమణి, హెచ్.లక్ష్మి, ఎం.లక్ష్మి, గణేష్, పి.రాజశేఖర్, పి.మల్లేసు, జి.అరుణశ్రీ, అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: కోల్‌కతాలో వైద్యురాలి హత్య దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.కరుణ, మహిళా డిప్యూటీ రీజనల్ కార్యదర్శి బి.వి జయలక్ష్మి అన్నారు. కోల్‌కతా సంఘటనను నిరసిస్తూ మంగళవారం జీటీరోడ్డులోని యూనియన్ బ్యాంక్ ప్రధాన బ్రాంచి వద్ద మహిళా ఉద్యోగులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి బి.శ్రీనివాసులు, డిప్యూటీ రీజనల్ కార్యదర్శి బి.మోహనరావు, యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు ఎ.సూర్య, శ్రీనివాస్, రాము, బాలచందర్, వాసు, ప్రసన్న, రమ్య, స్వాతి, ప్రతిభ, ఉమాప్రియ, మానస తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హతమార్చిన దుండగులను తక్షణమే శిక్షించాలని జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలోని వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం పక్కనున్న యూనియన్ బ్యాంక్ కార్యాలయంలో బ్యాంక్ ఉద్యోగులు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాష్ లైట్ ర్యాలీగా వెళ్తున్న జూడాలు



ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ..

శ్రీకాకుళం, శ్రీకాకుళం క్రైమ్ : కోల్‌కతాలోని జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనకు నిరసనగా నగరంలోని రిమ్స్ మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి రిమ్స్ వరకు మొబైల్ ఫ్లాష్ లైట్ ర్యాలీ చేశారు. స్టాప్ వైలెన్స్ అగెనెస్ట్ డాక్టర్స్.. అంటూ ఫ్లెక్సీలతో నినాదాలు చేశారు. అంతకుముందు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో మానవహారంగా ఏర్పడి ఫ్లెక్సీలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏపీ జూడా ప్రెసిడెంట్ డాక్టర్ జి.వెంకటేష్, జనరల్ సెక్రటరీ డాక్టర్ రాజ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ మోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థిని అత్యాచారం చేసిన హత్య చేసిన నిందులను కఠినంగా శిక్షించాలని విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని జనసేన నాయకుడు విష్వక్సేన్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. మహిళలపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు



కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు



నిరసన తెలియజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, కూటమి నాయకులు, వైద్యులు, విద్యార్థులు

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని దవళపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మంగళవారం మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం హయాంలోనే బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ఇంటింటికీ వెళ్లి అందించామన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హయంలో పేదల కోసం ఒక్క పథకం కూడా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. మడ్డువలస కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, నాయకులు కంచరాన రమణారావు, పేడాడ నారాయణరావు, చింతాడ వెంకటరమణ, పేడాడ శ్యామలరావు, పేడాడ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పేడాడ శ్రీరామ్మూర్తి

రాజీవ్‌గాంధీకి నివాళులు

శ్రీకాకుళం అర్బన్: భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన నవ నాయకుడు దివంగత రాజీవ్ గాంధీ కాంగ్రెస్ పార్టీకే కాక దేశానికి గొప్ప సంపదగా మిగిలిపోయారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బెహరా మానసిక వికలాంగుల కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, డి.గోవిందమల్లిబాబు, మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, మంత్రి నరసింహమూర్తి, చింతాడ దిలీప్, కోత మధుసూదన్‌రావు, కేవీఎల్ఎస్ ఈశ్వరి, కొత్తూరు శైలజ, డాక్టర్ కవిటి గోపాలకృష్ణ, దాట్ల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిత్యనగర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యనగర్ కాలనీలో లోవోల్టేజి విద్యుత్ కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. గృహాల సంఖ్యతో పాటు విద్యుత్ వినియోగం పెరుగుతున్న క్రమంలో కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా డిమాండ్‌కు తగ్గట్టుగా లేకుండా పోయింది. దీంతో రాత్రి వేళల్లో విద్యుత్ సమస్యలతో స్థానికులు అవస్థలు పడేవారు. దీనిపై 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలోనే ఈ కాలనీకి 100 కె.వి.ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కాగా.. దీన్ని డీ-1 ఏఈగా విధుల్లో ఉన్న కమల్‌హాసన్, తాను నివసిస్తున్న కొత్తగా ఏర్పడిన లక్ష్మీనగర్ కాలనీలో ఏర్పాటు చేయించుకున్నారు. దీనిపైనా కథనాలు రావడంతో విద్యుత్ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి ఏఈపై చర్యలకు దిగారు. కొద్ది నెలల క్రితం ఆదిత్యనగర్ కాలనీకి మరో 100కెవి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. ఆపరేషన్స్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఈఈ బయ్యన్నాయుడుల ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు ఆధ్వర్యంలో విద్యుత్ లైన్ పనులు పూర్తి చేశారు. సమస్యకు పరిష్కారం చూపిన 'సాక్షి'కి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తేజోమూర్తుల విగ్రహాలు పరిశుభ్రం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కొత్తబ్రిడ్జి రోడ్డులో ఇంటాక్ ఏర్పాటు చేసిన తేజోమూర్తుల విగ్రహాలకు సంబంధించిన 'తేజోమూర్తులను పట్టించుకోరా?' అనే శీర్షికన ఇటీవల సాక్షిలో వచ్చిన కథనంపై ఇంటాక్ చాప్టర్ ప్రతినిధులు స్పందించారు. కొత్త బ్రిడ్జి నుంచి సింహద్వారం వరకు విగ్రహాలను ఆనుకుని ఉన్న కొమ్మలను తొలగించారు. పోస్టర్లను తొలగించి పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఇంటాక్ కన్వీనర్, నూక సన్యాసిరావు, కో-కన్వీనర్ నటుకుల మోహన్, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడులు మాట్లాడుతూ మరో మూడు రోజుల పాటు పనులు నిర్వహిస్తామని చెప్పారు. ఇటీవలే కాలేజీ రోడ్డులో ఉన్న మల్లయోధుడు కోడిరామ్మూర్తి విగ్రహానికి రంగులు వేయించామని తెలిపారు.



విగ్రహాలను శుభ్రం చేయిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

యూత్ రెడ్‌క్రాస్‌పై అవగాహన

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల)లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో యూత్ రెడ్‌క్రాస్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సభ్యులు చేరిక, శిక్షణ, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, లెక్చరర్ డి.రవీందర్, రెడ్‌క్రాస్ ప్రోగ్రామ్ మేనేజర్ గొలివి రమణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

ఎచ్చెర్ల: లావేరు మండలం బొంతుపేట వద్ద అక్రమంగా తరలిస్తున్న కలపను విశాఖపట్నం రేంజ్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ సోమసుందరం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా కలపను అక్రమంగా తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకే దాడులు నిర్వహించామన్నాని సోమసుందరం తెలిపారు. ఈ దాడుల్లో 4 లారీలను సీజ్ చేశామన్నారు. ఒక్కొక్క లారీకి రూ.1,50,000 అపరాధ రుసుం విధించామన్నారు. మూడు జిల్లాల డీఎఫ్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

20 ఈటీఎల్ 05: కలపను తరలిస్తున్న లారీలు

పాతూరి సేవలు చిరస్మరణీయం



జిల్లా గ్రంథాలయంలో నాగభూషణం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



పాతూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం 117వ జయంతిని గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత పాతూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమానికి స్థిరమైన రూపురేఖలు దిద్దిన నాగభూషణం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బోటు గ్రంథాలయాలను తొలిసారిగా 1935-42 మధ్య తెనాలి బ్యాంక్ కాలువపై ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, గ్రంథాలయ సిబ్బంది టి.రాంబాబు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: గ్రంథాలయోద్యమానికి ఊపిరిలూదిన వ్యక్తి కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణం అని బలగ గ్రంథాలయశాఖ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. గ్రంథాలయంలో మంగళవారం నాగభూషణం జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, పాఠకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం కళా ప్రపూర్ణ పాతూరి నాగభూషణం జయంతిని ఘనంగా నిర్వహించారు. పాతూరి చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అయ్యంకి అనంతరం దాదాపు అర్ధ శతాబ్దం పాటు ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయోద్యమాన్ని విస్తరింపజేశారని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామసభలకు సిద్ధంకండి

గార: ఈ నెల 23న అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామసభలకు ఉపాధి హామీ సిబ్బంది సిద్ధం కావాలని ఎంపీడీవో సంజీవి రమణయ్య అన్నారు. మంగళవారం గార మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగే గ్రామసభలో మార్చి 2025లోగా నిర్వహించనున్న పనులపై తీర్మానం చేయాలన్నారు. కొత్తగా ఫీడర్ కాలువ నిర్మించడం, పంట కాలువ నిర్మాణం వంటి 38 రకాల పనులకు ఆమోదం తెలియజేయవచ్చన్నారు. రైతుల అవసరాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సీహెచ్.సంధ్యారాణి, జేఈ నారంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రమణయ్య

కెమెరా కన్ను చరిత్రకు సాక్ష్యం

శ్రీకాకుళం కల్చరల్: కెమెరా కన్ను చరిత్రకు సాక్ష్యమవుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, డీపీఆర్‌వో బాల్‌మాన్ సింగ్‌లు హాజరయ్యారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘానికి వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా పూర్వ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్ రూ.10వేలు విరాళంగా ప్రకటించారు. అనంతరం కెమెరా నిర్మాత లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీనియర్ ఫొటో జర్నలిస్టు పొడుగు గజపతిని సత్కరించారు. కార్యక్రమంల కె.వేణుగోపాల్, ఎస్.జోగినాయుడు, దేవీప్రసాద్, కొర్లాడ కొండబాబు, ఎల్.చిట్టిబాబు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి చెన్నకేశవరావు

సినీ గాయకుడు రామకృష్ణకు నివాళులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని గాయత్రీ ప్రెస్ వద్ద సినీ నేపథ్య గాయకుడు రామకృష్ణదాసు జయంతి మంగళవారం నిర్వహించారు. గాయత్రీ సినీ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకుడు కేఎల్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో రామకృష్ణ, ఘంటసాల ఆలపించిన పలు గీతాలను గాయకులు మూర్తి, శ్రీను, ఆర్.కె.పాణిగ్రహి, ఉమాకవి, కూర్మారావు, హేమచందర్, జి.రమేష్, దేవ్, శోభ, డి.వెంకటలక్ష్మి, తదితరులు గానం చేశారు. కార్యక్రమంలో ఎల్.రామలింగస్వామి, కంచరాన అప్పారావు, ఎం.వి.కామేశ్వరరావు, బాబూరావు, రాజు పాల్గొన్నారు.



రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అభిమానులు

విద్యార్థులకు అవగాహన

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని పలు విద్యాసంస్థల్లో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మాదకద్రవ్యాలు వినియోగిస్తే కలిగే దుష్పరిణామాలు, ప్రస్తుత కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఏ విధమైన క్రిమినల్ కేసులు నమోదవుతాయన్నది వివరించారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ దైవానందం

విజయగణపతికి విశేష అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.



విజయగణపతికి ప్రత్యేక అలంకరణ

సంతానలక్ష్మీగా విజయదుర్గ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలు వీధిలో విజయదుర్గా అమ్మవారిని శుక్రవారం సంతాన లక్ష్మిగా అలంకరించారు. అంతకుముందు అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, ఫణిశర్మలు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



విజయదుర్గ అమ్మవారు

పశువులకు గాలికుంటు టీకాలు

రణస్థలం: పశువుల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బంటుపల్లి గ్రామంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశువులకు సక్రమించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన తాగునీరు, మేత అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఏడీఏ దుర్గారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముత్యం మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళ విప్లవోద్యమ సాహిత్య పరిశోధకుడు, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణా సాహిత్య సాంస్కృతిక పరిశోధక రచయిత డాక్టర్ కె.ముత్యం ఆకస్మిక మృతి పట్ల పలు సాహితీ సాంస్కృతిక ప్రజా సంఘాలు సంతాపం ప్రకటించాయి. నాలుగున్నర దశాబ్దాల క్రితం ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సంఘానికి పీడీఎస్‌యూ తరపున అధ్యక్షుడిగా కొనసాగారు. ఈయన మృతి పట్ల కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, తాండ్ర ప్రకాష్, డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు, గొరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, మల్లిబాబు, సార జగన్, బెందాళం కృష్ణారావు, చింతాడ కృష్ణారావు, వంకల రాజారావు, బద్ది కూర్మారావు తదితరులు సంతాపం తెలియజేశారు.

ఘంటసాల బయోపిక్ ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు బయోపిక్‌ను సెప్టెంబరు 24న నగరంలోని సన్‌మేక్స్‌లో ప్రదర్శిస్తున్నట్లు ఘంటసాల అభిమాన సంఘం అధ్యక్షుడు బగాది కూర్మారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి నటుకుల మోహన్ మాట్లాడుతూ అభిమానులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జే.ఆర్.పురంలో నిత్యాన్నదానం

రణస్థలం: గత 237 రోజులుగా తన సొంత ఖర్చులతో జనసేన నాయకుడు గొర్లె సూర్య రోజుకు వందమందికి పైగా నిరుపేదలకు నిత్య అన్నదానం పెట్టడం ఎంతో అభినందనీయమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో జే.ఆర్.పురంలో గొర్లె సూర్య నిర్వహిస్తున్న డొక్క సీతమ్మ నిత్య అన్నదానంలో పాల్గొని అన్న వడ్డించారు. అనంతరం సూర్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ గణపతి ఆలయ వార్షికోత్సవం

గార: శ్రీకూర్మంలోని కామదహన మంటపం సమీపంలో విజయగణపతి దేవాలయ తొమ్మిదో వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. రాము, గణపతితో పాటు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.